క్లుప్తంగా

పుట్టాలమ్మకు సారె సమర్పణ



సారె అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: మండలంలోని రామలింగాపురంలో వెలసిన శ్రీగంగమ్మ దేవత సహిత పుట్టాలమ్మ ఆలయ మహాకుంభాభిషేకం సందర్భంగా ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముక్కంటి సారెను అందజేశారు. ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. వాటిని అమ్మవారికి ధరింపజేసి ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం అంజూరు తారక శ్రీనివాసులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బర్రె హేమ భూషణరెడ్డి, మురగయ్య, సుధాకర్, బత్తిరెడ్డి, మించల మనోహర్, శ్రీకాంత్, బత్తెయ్య, కిషోర్, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

వెండి కవచానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేట తెట్టులో వెలసిన నల్లగంగమ్మకు వెండి కవచం కోసం గాండ్లవీధికి చెందిన నింద్ర పరంధామయ్య, ఆయన కుమారులు వెంకటేష్లు, శ్రీనివాసులు రూ.51,116 అందజేశారు. నగదును ఆలయ కమిటీ చైర్మన్ కంతా రమేష్‌కి అందజేశారు. కమిటీ సభ్యులు ప్రదీప్, అనిల్, యాదగిరి, పూజారి శంకరయ్య ఉన్నారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

వరదయ్యపాళెం: మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పింఛన్ల పంపిణీ జరగనుందన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈనెల 8వ తేదీ తిరుపతిలో జరిగే సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కత్తిరవి, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, నాయకులు శ్రీనివాసులు, షణ్ముగం, గురవయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక



వేణుగోపాల్

రేణిగుంట: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న రేణిగుంట వాసి డాక్టర్ సి.వేణుగోపాల్‌ను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కళాశాల విద్యలో నూతన మెళకువలు, పరిశోధనల దిశగా ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. ఆయన ఇప్పటి వరకు 16 ఇంటర్మీడియెట్, డిగ్రీ అచ్చు పుస్తకాలు, 56 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రచురించారు. కళాశాల అభివృద్ధికి ఎన్ఏఏసీ, ఐక్యూఏసీ, పీజీ కోఆర్డినేటర్‌గానూ, రాష్ట్రంలోని వివిధ స్వయంప్రతిపత్తి కళాశాలలకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యునిగా, రిసెర్చ్ గైడ్‌గా సేవలందించారు. ఆయన ఎంపికపై తోటి అధ్యాపకులు, రేణిగుంటకు చెందిన పలువురు ప్రజాసంఘాల నాయకులు అభినందించారు.

18న నవసంధి వినాయకులకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నాలుగు మాడవీధుల్లో వెలసిన నవసంధి వినాయకులకు ఈ నెల 18న ముక్కంటి సారె సమర్పించనున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వినాయకచవితిని పురస్కరించుకుని ఉదయం 7గంటలకు ప్రధాన ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- ముచ్చివోలులో గడపగడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం పలికిన గ్రామస్తులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో ఆయన పర్యటించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకుని, వారందరికీ మేలు చేయాలన్న ఉద్దేశంతో నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నారన్నారు. దేశంలోనే వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. వలంటీర్ల సేవలకు మూడేళ్లుగా పురస్కారాలు, నగదు పారితోషికాలను ముఖ్యమంత్రి ఇస్తున్నారని, మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే అభివృద్ధి, సంక్షేమం మరింత వేగం పుంజుకుంటామన్నారు. రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

బాబు పాలనలో దగా

చంద్రబాబు పాలనలో ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ సక్రమంగా అమలు చేయకపోగా మహిళలు, రైతులను నిట్టనిలువునా దగా చేశారని విమర్శించారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, తమ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే అందిస్తున్నామన్నారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా అర్హతే కొలమానంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను సీఎం అందిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన ప్రజలకు కళ్ల ముందే కనబడుతున్నా ప్రతి పక్షాలు మాత్రం బురదజల్లుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ భానుమూర్తియాదవ్, సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, శాప్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గురునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బర్రి అమర్‌నాథ్‌రెడ్డి, ప్రసాద్‌యాదవ్, వెంకట చెంచయ్యయాదవ్, మునిశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణరథంపై శివపుత్రుని కటాక్షం



భక్తులతో నిండిపోయిన క్యూలు



స్వర్ణ రథంపై విహరిస్తున్న గణనాథుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆదివారం రాత్రి స్వర్ణ రథంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా ఆలయంలోని ఆస్థాన మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని కొలువు తీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ అధికారులు, ఉభయదారులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చి బంగారు రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఆలయం

కాణిపాకం ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు రోజు, సంకటహర చతుర్థి గణపతి వ్రతం కావడంతో వేల సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. ఆలయం వెలుపుల వరకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, వయో వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డల తల్లిదండ్రులను ప్రత్యేక క్యూల నుంచి స్వామివారి దర్శనం కల్పించారు.





స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అధికారులు, దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు

ప్రమాదం జరిగితేగానీ పట్టించుకోరా?





చిన్న పాండూరు సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుపై పడిన గుంతలో ఇరుక్కున్న లారీ, లారీని జేసీబీ సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

- ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై మండిపడుతున్న జనం
- వరదయ్యపాళెం–పెద్ద పాండూరు రోడ్డు మార్గంలో ఏడాది క్రితం కల్వర్టుపై పడిన గుంత
- ఇప్పటివరకు మరమ్మతులు చేయని వైనం
- గుంతలో ఇరుక్కున్న లారీ–స్తంభించిన ట్రాఫిక్

వరదయ్యపాళెం: రోడ్లు భవనాల శాఖ అధికారుల తీరుపై అటు వాహనదారులు, ఇటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరదయ్యపాళెం నుంచి పెద్ద పాండూరు మీదుగా చిన్న పాండూరుకు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు మార్గంలో అంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న పైపు కల్వర్టుపై గత ఏడాది కురిసిన వర్షాలకు గుంత పడింది. అయితే ప్రారంభంలో చిన్నపాటి గుంతగా ఉన్న ప్రదేశంలో రాన్రాను పెద్ద గుంతగా అయ్యింది. గుంత పడిన సమయంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పూడ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ తరచూ పడుతున్న వర్షాలకు మళ్లీ గుంతగా ఏర్పడుతోంది. తాజాగా శనివారం రాత్రి అటు వైపు వెళ్తున్న లారీ వెనుక టైరు గుంతలో ఇరుక్కుంది. దీంతో పెద్ద పాండూరు వైపు వెళ్తున్న వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. 2 గంటలకు పైగా వాహన రాకపోకలు స్తంభించాయి. ఏడాది కాలంగా గుంతకు మరమ్మతులు చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని ఆర్ అండ్ బీ శాఖపై పలువురు మండిపడ్డారు. గుంత పడిన ప్రాంతంలో నూతన పైపు కల్వర్టు నిర్మిస్తేగానీ సమస్య పరిష్కారం కాదని చెబుతున్నారు. చివరకు ఆ ఇరుక్కున్న లారీని స్థానిక ఎంపీటీసీ చొరవతో వెలికితీసి, రాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు

పిచ్చాటూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు అన్నారు. మండలంలో కొత్తగా 286 మందికి పింఛన్లు మంజూరైన నేపథ్యంలో పిచ్చాటూరులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందజేస్తోందని తెలిపారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు వచ్చేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. గ్రామ వలంటీర్లు, గృహ సారథులు తమ పరిధిలోని అర్హులైన కుటుంబాలను గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



డివైడర్‌ను తొలగిస్తున్న గ్రామస్తులు

ఏర్పేడు: స్థానిక వెంకటగిరి రోడ్డులో ఆదివారం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఏర్పేడు–వెంకటగిరి రోడ్డులో ఏర్పాటు చేసిన డివైడర్ వద్ద మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లగేజీ వ్యాను ఆర్అండ్‌బీ రోడ్డుకు మధ్య ఉన్న గుంతలో దిగబడడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్పందించిన వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు గ్రామస్తులతో కలిసి డివైడర్‌ను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.



వెంకటగిరి రోడ్డులో ఆగిన వాహనాలు

అంకమ్మకు ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లి గ్రామంలో వెలసిన శ్రీఅంకమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పూజల అనంతరం ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు ఎదురు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంకమ్మ దేవత ముగ్గు ఆకట్టుకుంది.







అలంకరణలో అంకమ్మ దేవత, పురవీధుల్లో విహరిస్తున్న అమ్మవారు, ఆకట్టుకున్న అమ్మవారి ముగ్గు

పళ్లికొండేశ్వరుని సేవలో నటుడు పొన్నాంబలం



పొన్నాంబలానికి ఆలయ మర్యాదలు చేస్తున్న చైర్మన్, ప్రధాన అర్చకులు

నాగలాపురం: సురుటుపల్లిలో వెలసిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆదివారం ప్రముఖ తమిళ నటుడు పొన్నాంబలం సందర్శించారు. పొన్నాంబలం ఇటు తెలుగు అటు తమిళ సినీరంగంలో హిట్లర్, ముఠామేస్త్రి, నరసింహుడు, ముత్తు వంటి పలు సినిమాల్లో నటించారు. వీరికి ఆలయ చైర్మన్ ఏఎంఎం మునిచంద్రశేఖర్ రెడ్డి (బాలాజి రెడ్డి) ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి స్వామి, అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ ఈఓ రామచంద్రా రెడ్డి అర్చకులతో ఆశీర్వాదం చేయించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కనులపండువగా మహాకుంభాభిషేకం



కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు

వెదురుకుప్పం: మండలంలోని ముసలయ్యగారిపల్లిలో వెలసిన గంగమ్మతల్లి మహాకుంభాభిషేకాన్ని ఆలయ సిబ్బంది మినిరాజులురెడ్డి, వెంకటేష్, రామూర్తి ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఈ మహాకుంభాభిషేకానికి ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం అర్చకులు వినాయకుడికి ప్రత్యక పూజలు చేసి, అమ్మవారి విగ్రహన్ని ప్రతిష్ఠంచారు. భక్తులకు అన్నదానం నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి: మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు గాండ్లవీధి (జనరల్), చిదంబరనగర్ 2,3వ వీధి (జనరల్), 28, 29 వార్డులకు చెందిన ధర్మరాజు గుడి వీధి ఉత్తరం, బజారువీధి తూర్పు (బీసీ రుబీ మహిళ), 1వ వార్డు పాండురాజుపురం, రాజీవ్‌నగర్ (జనరల్), 4వ వార్డు ఎస్‌వీ నగర్, ఎస్ఆర్ నగర్ (ఎస్సీ మహిళ), 12వ వార్డు మొదటి బీటీఎం వీధి, రాజీవ్‌గాంధీ వీధి (జనరల్), అన్నామెయిన్ రోడ్డు (జనరల్ మహిళ), మూడవ బీటీఎం వీధి (జనరల్), ఇందిరానగర్–1 (బీసీ–ఈ), 20వ వార్డు ఈశ్వరగుడి వీధి ఉత్తరం, ఎల్లమ్మ గుడి వీధి (ఎస్సీ), 18, 19వ వార్డుకు చెందిన పళ్లిపట్టు మెయిన్ రోడ్డు దక్షిణం (బీసీ మహిళ), పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగి, వయసు 18 నుంచి 35లోపు ఉన్నవారు ఈ నెల 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 11, 12 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. 13వ తేదీలోపు ఎంపిక చేసిన వలంటీర్లకు సమాచారం అందుతుందని, 14వ తేదీ నుంచి బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

ముగిసిన కొలుపు



గ్రామ వీధుల్లో విహరిస్తున్న అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో శ్రీకానగలమ్మ

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో వెలసిన శ్రీకానగలమ్మ కొలుపు ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనమతించారు. మధ్యాహ్నం హరికథా కాలక్షేపం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రి అమ్మవారికి ఉభయదారులు సారె సమర్పించారు. విశేష అలంకరణలతో శ్రీకానగలమ్మ ప్రత్యేక వాహనంపై ఊరేగుతూ కనువిందుచేశారు.